ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మౌలిక వసతులు కల్పించాలి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన రాయదుర్గం విద్యాకమిటీ సభ్యులు



రాయదుర్గం: మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం సభ్యులు ఎమ్మెల్యే గాంధీని కలిసి శాలువాతో సత్కరించి వినతిపత్రాన్ని అందించారు. ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

ఖానామెట్‌లో డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాం: ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్‌లోని ఖానామెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థలం కేటాయించామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. రాయదుర్గం విద్యాకమిటీ సభ్యులతో ఆయన మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకొని త్వరలోనే కళాశాలను ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంతేకాకుండా రాయదుర్గంలోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం విద్యా కమిటీ సభ్యులు కృష్ణాగౌడ్, నరేందర్‌ముదిరాజ్, సురేష్‌ముదిరాజ్, ప్రభాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి



పాపిరెడ్డినగర్‌లో మురుగు సమస్యను పరిశీలిస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: పాపిరెడ్డినగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో బీజేపీ నాయకులతో కలసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ కాలనీలో గత కొన్ని ఏళ్ల క్రితం వేసిన డ్రైనేజీ లైన్లు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదన్నారు. జనాభా తగ్గట్టుగా పైపుల సామర్థ్యం పెంచాలని అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. కాలనీలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానన్నారు. లేదా సొంత నిధులతోనైనా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ కె.ఎల్లేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు రాజుశెట్టి, నాయకులు రమేష్, నర్సింహ, నర్సింగ్ యాదవ్, నీలకంఠరెడ్డి, హజరత్, సిద్ధు, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా భ్రమరాంబదేవి



అల్విన్‌కాలనీ: అల్విన్ కాలనీ ఫేజ్ 2లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారికి వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిలేశ్వర శర్మ గణపతి పూజ, చండీహోమం , సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి అలంకరించిన కూరగాయలతో మహా ప్రసాదం తయారు చేసి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డి తెలిపారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పటాన్‌చెరు మండల స్పెషల్ ఆఫీసర్ దేవుజా

పటాన్‌చెరు: వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని పటాన్‌చెరు మండల స్పెషల్ ఆఫీసర్ దేవుజా అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శనివారం పటాన్‌చెరు మండలం పోచారం గ్రామంలో ఎంపీడీఓ యాదగిరి, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్‌లతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ దేవుజా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.



పోచారం గ్రామంలో మొక్కలు నాటుతున్న స్పెషల్ ఆఫీసర్ దేవుజా

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా ముదిరాజ్

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతన్నకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో అన్నదాతలు ఆనందంలో ఉన్నారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా ముదిరాజ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు రుణమాఫీ చేస్తామంటే హేళన చేసిన బీఆర్‌ఎస్ నేతలు, ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు రాజీనామా పత్రం సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. హరీష్‌రావు రాజీనామా చేయడంతో పాటు మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయననే మాటకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు.

భూగర్భ పైప్‌లైన్ పనులు పరిశీలన



భూగర్భ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఇండియన్ బ్యాంకు నుంచి ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలా వద్ద రెండు కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన భూగర్భ పైపు లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ డీఈ రమేష్, ఈఈ గోవర్ధన్, ఎస్‌ఈ చెన్నారెడ్డి, ఏఈ శ్రావణిలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారిలో శుభోదయ కాలనీ పరిసర ప్రాంతాల్లో రోడ్డుమీద నిలిచిపోతున్న వరద నీటిని ప్రస్తుతం నిర్మిస్తున్న పైపు లైన్ల ద్వారా నేరుగా ఎల్లమ్మ చెరువు సర్‌ప్లస్ నాలాలో కలిసేటట్లుగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. వర్షం కురిస్తే ఇండియన్ బ్యాంక్ పరిసరాల్లోని ఇళ్లు, అపార్టుమెంట్ సెల్లార్‌లలో నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నిర్మాణం పూర్తయితే సమస్య తొలగిపోతుందన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్ అలీ మున్నా, సయ్యద్, యాదగిరి, మహేష్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి



జిన్నారం(పటాన్‌చెరు): మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అధికారులకు సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం రోజారాణి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో శుక్రవారం పోలీసులు ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ గంగాధర్, ఎస్‌ఐ దశరథ్‌ల ఆధ్వర్యంలో ఆయా కాలనీల్లో సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువత



ఇతిహాసాల నుంచి నేటి పోటీ పుస్తకాల వరకు..

వీర బ్రహ్మంగారి తాళపత్ర గ్రంథాలు సైతం

పరిశోధకులు, రచయితలకు మార్గదర్శి సుందరయ్య లైబ్రరీ



సుందరయ్య లైబ్రరీలో పుస్తకాలను పరిశీలిస్తున్న అప్పటి మంత్రి సబితా ఇంద్రా రెడ్డి(ఫైల్)



గచ్చిబౌలి: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య పేరిట నెలకొల్పిన లైబ్రరీ నేటి తరానికి విజ్ఞానగనిగా మారింది. ఇతిహాసాలు, తాళపత్ర గ్రంథాలు మొదలు ఎన్నో పుస్తకాలను ఈ లైబ్రరీలో భద్రపరిచారు. నాటి చరిత్ర, సంస్కృతిపై పరిశోధన చేయాలన్నా, ఓ రచన చేయాలన్నా అక్కడికి వెళ్లే వారు ఎందరో ఉన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని సుందరయ్య లైబ్రరీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారికి మనోధైర్యాన్ని ఇస్తోంది.

2012 నుంచి అందుబాటులోకి..

2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి నాలుగున్నర ఎకరాల స్థలం కేటాయించారు. భవన నిర్మాణం పూర్తయ్యాక 2012లో అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, సీపీఎం నేత సీతారాం ఏచూరి దీనిని ప్రారంభించారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషలలో రెండు లక్షల 80 వేల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కనుమరుగైన పత్రికలు, ఎన్నో గ్రంథాలు, నవలలు ఈ లైబ్రరీలో ఉన్నాయి. కారల్ మార్క్స్ కలెక్షన్ వాల్యూమ్స్, లెనిన్, స్టాలిన్ వాల్యూమ్స్‌లో పాటు మహాత్మగాంధీ, అంబేడ్కర్ వాల్యూమ్స్, ఈపీ డబ్ల్యూ (ఎకనామికల్, పొలిటికల్ వీక్లీ) లా బుక్స్, చిల్డ్రన్స్ స్టోరీస్, పోతులూరి వీర బ్రహ్మంగారు రాసిన తాళపత్ర గ్రంథాలు భద్రపరిచారు.



తెలుగు ఇతిహాసాలు

పరిశోధన కోసం..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, ఓపెన్ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, బిట్స్ పిలానీకి చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ప్రొఫెసర్లు, రచయితలు ఈ లైబ్రరీకి వస్తుంటారు. సివిల్స్, గ్రూప్స్ ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు కూడా నిత్యం వస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లైబ్రరీలో ప్రిపేర్ అవుతున్నారు. రూ.500 చెల్లిస్తే సంవత్సరం మొత్తం పుస్తకాలు చదువుకునేందుకు వీలుంటుంది. నెలకు రెండు వేలు చెల్లించిన వారికి వైఫై అవకాశం కల్పిస్తారు.

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా

పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్నాను. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుందరయ్య లైబ్రరీలో చదువుకుంటాను. నా వద్ద ఉన్న మెటీరియలే కాకుండా లైబ్రరీలోని పుస్తకాలను తీసుకుంటాను. మార్కెట్‌లో లేని ఎన్నో పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. - గౌతమి

కంప్యూటరైజ్ చేస్తున్నాం



సుందరయ్య లైబ్రరీలోని పుస్తకాలను 2015 నుంచి కంప్యూటరైజ్ చేస్తున్నాం. కవర్ పేజీ నుంచి చివరి పేజీ వరకు ప్రతి పేజీని స్కానింగ్ చేస్తున్నాం. పీడీఎఫ్ ఫైల్ తయారు చేసి వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇప్పటి వరకు దాదాపు 20 వేల పుస్తకాలను వెబ్ సైట్‌లో ఉంచాం. రెండు స్కానింగ్ మిషన్‌ల ద్వారా నిత్యం ఏడుగురు పని చేస్తున్నారు. మరో సంవత్సరంలో తెలుగు పుస్తకాలను వెబ్ సైట్‌లోకి తీసుకొస్తాం.

-అనిల్, సుందరయ్య లైబ్రరీ ఇన్‌చార్జ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జేవీజీహిల్స్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గాయత్రి లేఅవుట్, కాంతివనం, సెంట్రల్ పార్క్ ఫేజ్-2, శిల్పావ్యాలీ, మాధవహిల్స్, జేవీజీహిల్స్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాజరాజేశ్వరీనగర్ కాలనీ, మాధవహిల్స్, ఓయూ కాలనీ, గోల్డెన్ తులీప్, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీరాంనగర్, మసీద్‌బండ, కొండాపూర్ ఏరియా హాస్పిటల్, సైబర్‌హిల్స్, బాబుఖాన్ లేన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

◆ వైట్ ఫీల్డ్ పరిధిలో... శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వైట్‌ఫీల్డ్ ఎస్‌బీఐ లేన్, అంజయ్యనగర్, కళాజ్యోతి బిల్డింగ్ పరిసరాలు, మసీద్‌బండ క్రాస్ రోడ్డు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్, మసీద్‌బండ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

◆ కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్ 1 నుంచి 7 వరకు, అపర్ణ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదు

◆ సురక్ష కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సురక్ష కాలనీ, రాజేంద్రరెడ్డి కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణహిల్ పార్కు తదితర ప్రాంతాలలో..

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

శాంతినగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శాంతినగర్, దీప్తిశ్రీనగర్, రోడ్డు నంబర్ 14, ధర్మపురి టెంపుల్ రోడ్డు, ఉషోదయ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

నల్లగండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు నల్లగండ్ల హుడాకాలనీ, నల్లగండ్ల ప్రాంతం, రత్నదీప్ వెనకప్రాంతంలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

◆ డైమండ్ హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు డైమండ్‌హిల్స్, శ్రీరామ్‌కాలనీ, జవహర్ నవోదయ విద్యాలయ ఎదురుగా ఉండే ప్రాంతాలలో..

◆ గుల్‌మొహర్‌పార్కు విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల వరకు..

◆ బాపూనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల వరకు బాపూనగర్, నెహ్రూనగర్, ఆదర్శనగర్ ప్రాంతం, గోపీనగర్ బస్తీలలో విద్యుత్ ఉండదని అధికారులు పేర్కొన్నారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు ప్రశాంత్‌హిల్స్, రాయదుర్గం, ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు ఏపీహెచ్‌బీ, జయభేరి ఎన్‌క్లేవ్, రాయదుర్గం, మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు టీఎన్‌జీవోస్ ఫేజ్-1, ఫేజ్-2, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, మధ్యాహ్నం 12.30 నుంచి 1 గంటల వరకు ఓల్డ్ గచ్చిబౌలి, జర్నలిస్ట్ కాలనీ, మధ్యాహ్నం 1 గంటల నుంచి 1.30 గంటల వరకు గౌలిదొడ్డి, పద్మశ్రీ గార్డెన్, టింబర్ లేక్ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని గచ్చిబౌలి ఏఈ వేణు గోపాల్ చెప్పారు.

భగవద్గీత ఉచిత శిక్షణ తరగతులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకరమఠం ఆవరణలో ఈ నెల 22 నుంచి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మఠం కార్యనిర్వహణాధికారి సిఎస్‌ఆర్ మూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 20 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు శంకరమఠం ఆవరణలోని వి.సూర్యనారాయణ శర్మను సంప్రదించాలని సూచించారు.

నేడు గురుపూర్ణిమ వేడుకలు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం గురుపూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు అన్నదానం జరుగుతుంది. సాయంత్రం 5గంటలకు విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరం, భాస్కర్ డ్యాన్స్ అకాడమీ శిష్యబృందంచే నృత్య ప్రదర్శన ఉంటుంది.

పదవీ విరమణ సన్మానం



సన్మాన సభలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి: గోపీనగర్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు షమీమ్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ హాజరై శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ రిటైర్మెంట్ అనేది ఉద్యోగులకు తప్పదన్నారు. ఎంతో మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది వారి ఉన్నతికి దోహద పడిన షమీమ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు శివరాజ్, నాయకులు రవీందర్‌గౌడ్, గోపాల్ యాదవ్, రాములు, దివాకర్‌రెడ్డి, నర్సింహ, మహేష్ పాల్గొన్నారు.

21న బాల బృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బాలబృందావనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇన్ టచ్ ది గుడ్‌నెస్ ఇన్‌సైడ్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ళ లోపు బాలబాలికలు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని ప్రతినిధులు సూచించారు.

8 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 08 మందికి రూ. 2 వేల చొప్పున జరిమాన, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం....బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 8 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన, మరో వ్యక్తికి జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

చెరువుల్లోకి మురుగు చేరకుండా చర్యలు

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు చెరువుల్లోకి వెళ్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెస్ట్ జోనల్ పరిధిలోని మల్కం చెరువు, పటేల్ చెరువు, గంగారం చెరువు, కాయిదమ్మ కుంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల పరిరక్షణతో పాటు, శుభ్రంగా ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. డైవర్షన్ చానళ్ల ద్వారా మురుగు నీటిని మళ్లించాలని అధికారులకు సూచించారు. చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలన్నారు. అనంతరం ఖాజాగూడ, గచ్చిబౌలి, లింగంపల్లి తదితర ప్రాంతాలలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీ లేక్స్ శివకుమార్ నాయుడు, డీసీలు రజినీకాంత్ రెడ్డి, వంశీకృష్ణ, ఇంజనీరింగ్, ఇరిగేషన్, శానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వెలిగిన వీధిదీపాలు



బుధవారం రాయదుర్గం ప్రధాన రోడ్డులో అలుముకున్న చీకటి

సాక్షి ఎఫెక్ట్..



శుక్రవారం విద్యుత్ వెలుగుల్లో రోడ్డు

రాయదుర్గం: 'ప్రధాన రోడ్డులో చిమ్మ చీకట్లు' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన వార్తకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. రాయదుర్గం ప్రధాన రోడ్డులో కొత్త బల్బులను ఏర్పాటు చేయడంతో వీధి దీపాలు వెలిగాయి. రాయదుర్గంవాసి దుర్గారామ్ 'సాక్షి'లో ప్రచురితమైన వార్తను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరింపజేశారు.

ల్యాంకోహిల్స్‌లో వివాదం

ఇరు వర్గాలపై కేసు నమోదు

గచ్చిబౌలి: ల్యాంకోహిల్స్‌లో క్లబ్ హౌస్, కామన్ ఏరియా వాడకంపై వివాదం నెలకొన్న ఘటనలో రాయదుర్గం పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ల్యాంకోహిల్స్ అపార్ట్‌మెంట్, పక్కనే విల్లాస్ ఉన్నాయి. అపార్ట్‌మెంట్‌లోని క్లబ్ హౌస్ ఉపయోగించుకునేందుకు విల్లాస్‌లో ఉండేవారు వెనక నుంచి చిన్న గేట్ వద్ద బయోమెట్రిక్ ఏర్పాటు చేసి లోపలికి వస్తున్నారు. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ గేట్ మూసివేసింది. మెయిన్ గేట్ ద్వారా మాత్రమే రావాలని చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, విల్లాస్ అసోసియేషన్ అధ్యక్షులు అదిత్య ఫిర్యాదు చేశారని, ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువు అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాయసముద్రం చెరువు వద్ద పిచ్చి మొక్కల తొలగింపు పనులను ఆమె పరిశీలించారు. చెరువు అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరామని తెలిపారు.

క్రెడిట్ కార్డ్ అప్‌డేట్ అంటూ సైబర్ మోసం..

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డ్ అప్‌డేట్ అంటూ సైబర్ నేరగాళ్లు లక్ష తొంభైమూడు వేల రూపాయలు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్‌కి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి ఈనెల 17వ తేదీన అపరిచిత వ్యక్తులు బ్యాంక్ నుండి కాల్ చేస్తున్నామని క్రెడిట్ కార్డ్ యాన్యువల్ సర్వీస్ ఛార్జెస్ యాక్టివేషన్ చేయాలని ఫోన్ రావడంతో బాధితురాలు తన వివరాలను చెప్పడంతో పాటు తన ఫోన్‌కి వచ్చిన ఓటీపీ చెప్పింది. దీంతో వెంటనే బాధితురాలి ఖాతాలో ఉన్న రూ.1, 93,000 వేలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవగాహన ర్యాలీ

ఆల్విన్‌కాలనీ: ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల నివారణపై శుక్రవారం జీహెచ్‌యంసీ ఎంటమాలజీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో ప్లకార్డులు పట్టుకొని పాదయాత్ర చేస్తూ అవగాహన కల్పించారు.

IN THE COURT OF XI ADDL. DISTRICT AND SESSION JUDGE: RANGA REDDY DISTRICT: AT L. B. NAGAR
O.S.No. 406 OF 2021

Between:
K. Sudhakar Reddy and others ...Petitioners/Plaintiffs
AND
K. Pramod Reddy and 15 others ... Respondents/Defendants

To,
[illegible]

(ORDER OF THE HON'BLE COURT)
Sd/- S.BALVANTH REDDY TS/21C/1034, ADVOCATE
[illegible]

IN THE COURT OF XI ADDL. DISTRICT AND SESSION JUDGE: RANGA REDDY DISTRICT: AT L. B. NAGAR
I.A. No. 392 OF 2021
IN
O.S.No. 406 OF 2021

Between:
K. Sudhakar Reddy and others ...Petitioners/Plaintiffs
AND
K. Pramod Reddy and 15 others ...Respondents/Defendants

[illegible]

(ORDER OF THE HON'BLE COURT)
Sd/- S.BALVANTH REDDY TS/21C/1034, ADVOCATE
[illegible]